## క్లుప్తంగా

### క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

నందవరం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని నందవరం మండలం నాగలదిన్నె గ్రామంలో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో సొసైటీ–11 జట్టు విజేతగా, నాగలదిన్నె జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేత జట్టుకు రూ.20,016, రన్నర్ జట్టుకు రూ.10,016 నగదు, ట్రోఫీలను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. నాయకులు ముగతి విరుపాక్షిరెడ్డి, షేక్ అహ్మద్, శరత్, ప్రభాకర్, నాగప్ప పాల్గొన్నారు.

### పరామర్శ



చికిత్స పొందుతున్న వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ నాయకుడు, ముక్కెళ్ల మాజీ సర్పంచ్ వెంకటేష్ పెరాలసిస్ బారినపడి మూడు రోజుల క్రితం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆదివారం ఆసుపత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. వెంకటేష్ త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

### సేవా కార్యక్రమాలకు ముందుంటాం

కృష్ణగిరి: సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ముందుంటామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పోచిమిరెడ్డి సేవాదళ్ వ్యవస్థాపకుడు మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. చుంచుఎర్రగుడి గ్రామంలో రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ముందుగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సేవాదళ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, వెంకటరాముడు తదితరులు ఉన్నారు.

### పోలీసు సేవలు భేష్

వెల్దుర్తి: మహాశివరాత్రి జాగరణ సందర్భంగా బ్రహ్మగుండం క్షేత్రంలో పోలీసుల సేవలు శభాష్ అనిపించాయి. కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో తిరునాలలో తప్పిపోయిన చిన్నారులను మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా కనుగొని కుటుంబీకులకు అప్పగించారు. పత్తికొండ డీఎస్పీ సారథ్యంలో వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి చేపట్టిన కట్టుదిట్టమైన చర్యలతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. రాత్రి సమయంలో ట్రాఫిక్ కంట్రోలింగ్, పార్కింగ్, అల్లర్లకు తావివ్వకుండా బందోబస్తు నిర్వహించడంపై పలువురు ప్రశంసించారు.

### అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

తుగ్గలి: మండల కేంద్రానికి చెందిన వీఆర్‌ఏ వెంకటేశ్వర్లు (54) ఆదివారం మృతి చెందారు. ఈయన గత మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడు తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవి, ఆర్‌ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు రహిమాన్, వెంకటరాముడు, కాశీరంగస్వామి, సిబ్బంది వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయం రూ.25 వేలు అందజేశారు.

### కోలుకోలేక మహిళ..

తుగ్గలి: ఆత్మహత్యకు యత్నించిన జొన్నగిరికి చెందిన మారిక రాణి (23) కోలుకోలేక మృతి చెందినట్లు జొన్నగిరి ఎస్‌ఐ రామాంజినేయులు ఆదివారం తెలిపారు. మృతురాలు స్వగ్రామం జొన్నగిరి కాగా కడమకుంట్లకు చెందిన అంజినేయులుతో వివాహం అయ్యింది. వీరు జొన్నగిరిలోనే నివాసం ఉంటున్నారు. ఈనెల 10న మారిక రాణి ఉరేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు కిందకు దించి చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండేదని, పిల్లల ఆరోగ్యం కూడా సరిగాలేకపోవడంతో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి తిమ్మరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

### చెట్టుపై నుంచి పడి వ్యక్తి..



మునెప్ప (ఫైల్)

గోనెగండ్ల: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన మునెప్ప (39) చెట్టుపై నుంచి జారిపడి మృతిచెందినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మునెప్ప శనివారం సాయంత్రం అదే కాలనీకి చెందిన మునిస్వామి అనే వ్యక్తి ఇంటి వద్ద ఉన్న కొబ్బరిచెట్టును టెంకాయలు తెంచేందుకు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కింద పడ్డాడు. మునెప్ప తలకు తీవ్రగాయాలు కావడంతో కాలనీవాసులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

# కనుల పండువగా మహారథోత్సవం



అశేష జనవాహిని మధ్య సాగుతున్న గురజాల రామలింగేశ్వరుడి రథోత్సవం



రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

నందవరం: దక్షిణ కాశీ పురవాసి శ్రీ రామలింగేశ్వరుడి మహారథోత్సవం ఆద్యంతం అద్వితీయం.. మంగళ వాయిద్యాలు, డప్పు దరువులు, వేద మంత్రోచ్ఛరణలతో అశేష జనవాహిని మధ్య ఆది దంపతుల రథయాత్ర రమణీయంగా సాగింది. మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా గురుజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో ఈఓ దినేష్ ఆధ్వర్యంలో మహారథోత్సవం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి చేతుల మీదుగా యాగమంటపంలో పూర్ణాహుతి గావించి రథోత్సవానికి అంకురార్పణ పలికారు. ఆలయ ముంగిట నుంచి అంగరంగా వైభవంగా బయలుదేరి నంది మంటపం వరకు యాత్ర చేపట్టారు. నందీశ్వరుడికి నారికేళాల సమర్పణ పూజలు గావించి యథాస్థితికి రథాన్ని చేర్చారు. రథయాత్ర సందర్భంగా చేపట్టిన భజన మండళ్ల గేయాలపాలనులు, నృత్య ప్రదర్శనలు, కొలాటాలు, నంది కోళ్ల ప్రదర్శలు భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్‌ఐలు, 20 మంది ఏఎస్‌ఐలు, 50 మంది పోలీసు సిబ్బంది, 40 మంది మహిళా పోలీసులు, 30 మంది వలంటీర్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

### కల్యాణం.. కమనీయం

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో జాగరణ కానిచ్చి వేకువజామున పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం జరిపారు. ఆలయంలో ప్రత్యేక వేదికపై శివపార్వతులను పెళ్లి పీటలపై ఆశీనులను చేశారు. పురోహితులు వేద మంత్రాలతో పెళ్లి తంతు కానిచ్చారు. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. ఉదయం తుంగా నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కాశీ, రామ, ధర్మ, భీమ, ఎర్ర లింగాలను దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పెద్ద నరసింహులు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ వీరస్వామి పాల్గొన్నారు.

### పక్కీరప్ప తాత రథోత్సవం

ఆస్పరి: ఆస్పరిలో వెలసిన పక్కీరప్ప తాత రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తుల జయ జయ ధ్వనాల మధ్య స్వామి వారి రథాన్ని నంది విగ్రహం వరకు లాగి, తిరిగి యథాస్థానానికి చేర్చారు. నిర్వాహకులు పెద్ద తిమ్మన్న ఆధ్వర్యంలో పక్కీరప్ప తాత ఉత్సవ విగ్రహంతో పాటు కుంభాలను భక్తులు మేళతాళాలతో ఊరేగించారు. గురవయ్యల నృత్యం ఆకట్టుకుంది. అలాగే యాటకల్లులో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.



ఆస్పరిలో పక్కీరప్ప తాత రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం →

## బోడబండ.. భక్తజన కొండ



బోడబండలో పక్కీరప్ప స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

తుగ్గలి: బోడబండ పుణ్యక్షేత్రం జనంతో కిక్కిరిసిపోయింది. అశేష జనసందోహం మధ్య ఆదివారం నిర్వహించిన తిమ్మగురుడు, పక్కీరప్ప స్వాముల రథోత్సవం కనుల పండువగా సాగింది. రెండు రోజులుగా చుట్టుపక్కల గ్రామాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వాముల వారిని దర్శించుకొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వేర్వేరు రథాలపై ఉంచి ఆనందోత్సాహాల మధ్య భక్తులు రథాలను లాగారు. ఆలయ ధర్మకర్తలు సుదర్శనరెడ్డి, అప్పా వేణు, ఉప్పర్లపల్లి, మీటేతండ సర్పంచ్‌లు ప్రభాకరరెడ్డి, బాలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాందాస్, నిర్వాహకులు కనికిరెడ్డి సోదరులు, అప్పా సోదరులు, పూజారులు కృష్ణయ్యచారి, భీమన్న, పక్కీరప్ప పాల్గొన్నారు.

వెల్దుర్తి: తిమ్మగురుడు స్వామి తిరునాల సందర్భంగా చెర్లకొత్తూరు గ్రామంలో ఆదివారం ఫక్కీరప్ప తాత రథోత్సవం ఆలయ పూజారి ఎల్లయ్య తాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తాత సమాధి ప్రాంతం నుంచి రథంపై తాత చిత్రపటాన్ని ఉంచి రథాన్ని లాగుతూ, వెంకటనాయుని పల్లె కుశలన్న బృందం వారి సీతారామాంజనేయ చెక్కభజన మధ్య గ్రామంలో ఊరేగించారు. సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

# విజేత డి.రంగాపురం వృషభాలు



వృషభాల యజమానులకు నగదు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కృష్ణగిరి: చుంచుఎర్రగుడి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలను సర్పంచ్ కురువ మాదేవమ్మ, వైఎస్సార్‌సీపీనాయకుడు లక్ష్మీకాంతరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం డి.రంగాపురంకు చెందిన జూటూరు మహేంద్రారెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. తరువాతి స్థానాల్లో గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు చెవిటి సుంకన్న వృషభాలు, ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల సర్పంచ్ రంగస్వామి వృషభాలు, కంబాలపాడు చిన్న రంగడు, కోయిలకొండ సంజీవుడు వృషభాలు ఉమ్మడిగా నాల్గవస్థానం, కోడుమూరు మండలం, క్రిష్టాపురానికి చెందిన బోయ శివరాముడు వృషభాలు ఐదో స్థానంలో నిలిచాయి. వృషభాల యజమానులకు దాతలు సంగాల గిడ్డయ్య, లక్ష్మీకాంతరెడ్డి, రామకృష్ణ, ఉప్పరి మద్దిలేటి, బాల వెంకటరాముడు, కత్తి చిన్నరాముడు, రమేష్‌గౌడ్‌లు వరుసగా రూ.40,116, రూ. 30,116, రూ.20,116, రూ. 10,116, రూ.5,116 అందజేశారు.

### భజన పోటీల విజేత ఆలంకొండ

ఆలయంలో శనివారం రాత్రి నిర్వహించిన భజన పోటీల్లో ఆలంకొండ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి భజన బృందం మొదటి స్థానంలో నిలవగా, రెండవ స్థానంలో వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి, మూడవ స్థానంలో బేతంచర్ల మండలం మండ్లవానిపల్లె, నాల్గవ స్థానంలో అనంతపురం జిల్లా, గుత్తి ఆర్‌ఎస్, ఐదవ స్థానంలో దొర్నిపాడు, ఆరవ స్థానంలో చెరుకులపాడు, ఏడవ స్థానంలో సంగాల, ఎనిమిదో స్థానంలో డోన్ మండలం జగదుర్తి భజన బృందాలు గెలుపొందినట్లు గ్రామస్తులు తెలిపారు. గెలుపొందిన వారికి దాతల సాయంతో వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ, 4 వేలు, రూ. 2 వేలు, రూ. 1,516లను అందజేశారు.

### ఘనంగా ఉచ్చాయోత్సవం

హొళగుంద: ముద్దటమాగి గ్రామంలో వెలిసిన సిద్ధలింగేశ్వర స్వామి ఉచ్చాయోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఉచ్చాయంలో ప్రతిష్ఠించిన స్వామి చిత్రపటానికి ఆలయ పూజారులు మహామంగళారతి, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్థానిక తేరు బజారులో ఉచ్చాయాన్ని ఎదురు బసవన్న కట్ట వరకు లాగారు. ఉచ్చాయోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, టీడీపీ ఆలూరు ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ, చిప్పగిరి జెడ్పీటీసీ విరుపాక్షి, మోహన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉరుసు మహోత్సవం

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో వెలసిన దివానే మస్తాన్ వలి స్వామి 37వ ఉరుసును గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రతిమను గుర్రంపై ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు.

## అలరించిన చెక్కభజన

కృష్ణగిరి: చుంచుఎర్రగుడి గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయమే అశేష జనవాహిణి మధ్య పురోణితుల ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రామలింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను పుష్పరథంపై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు గ్రామస్తుల ఆధ్వర్యంలో రెండు రోజులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పల్లకీ ముందు రాంపల్లి శ్రీను చెక్కభజన బృందం అందరినీ ఆకట్టుకుంది. అలాగే మండలంలోని కంబాలపాడు, కటారుకొండ గ్రామాల్లోని శివాలయాల్లో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని ఆయా గ్రామాల ప్రజలు చేపట్టి అనంతరం విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు.



చుంచుఎర్రగుడి గ్రామంలో పుష్పరథం ముందు చెక్కభజన ప్రదర్శిస్తున్న కళాకారులు

# కమనీయం.. ఆదిదంపతుల కల్యాణోత్సవం





బిణిగేరిలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు, కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ఆస్పరి: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బిణిగేరి సమీపంలో శ్రీగిరి క్షేత్రంలో వెలసిన పంచలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో వేద పండింతులు వైద్యం రాజస్వామి, అనిల్ స్వామి, సంతోష్ స్వామి వేద మంత్రాలతో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. ఆలయంలో పంచలింగేశ్వర స్వామికి గంగపూజ, కుంభోత్సవం నిర్వహించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను నందికోలు సేవ, గంధం సేవ మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం గొరవయ్యల పాలసేవ, నృత్యం, మండలంలోని చిగిళి గ్రామానికి చెందిన నాగలింగయ్య స్వామి చెప్పిన వీరభద్ర స్వామి ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఓం నమఃశివాయ నామస్మరణంతో శ్రీగిరి క్షేత్రం మార్మోగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పెసలదిన్నె గ్రామంలో మహాశివరాత్రి పురస్కరించుకొని శ్రీ మోక్షలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పార్వతి, పరమేశ్వరులకు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ వీధుల్లో భక్తుల హర్షధ్వానాల మధ్య రథం ముందుకు కదిలింది. గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే గుడేకల్లు గ్రామంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఆదివారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. శనివారం రాత్రంతా దేవాలయంలో భజనలు చేస్తు గడిపారు. ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారి పల్లకీ ఉరేగింపు నిర్వహించారు.



గుడేకల్‌లో భ్రమరాంబా మల్లికార్జున స్వామివారి కల్యాణోత్సవం

ఆలూరు రూరల్: పట్టణంలోని కోటవీధిలో వెలిసిన భీమలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ఎర్రిస్వామి, మల్లికార్జున స్వామి, గ్రామస్తుల సమక్షంలో శనివారం రాత్రి 11.59 నిమిషాల శుభ ముహుర్తాన వేదమంత్రాల నడుమ శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీ ఎత్తున ఆలయానికి తరలివచ్చి అక్షింతలు వేశారు. కల్యాణోత్సవం సమయంలో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామస్తులకు అన్నప్రసాదాలు పంచి పెట్టారు.



ఆలూరు భీమలింగేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

## ఉమామహేశ్వరుడి తిరునాల సందడి

కృష్ణగిరి: మండల పరిధిలోని లక్కసాగరం గ్రామంలో ఉమామహేశ్వర స్వామి తిరునాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ధర్మకర్తలు పి.లక్ష్మిరెడ్డి, పి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వరుడిని ప్రభపై పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం చుట్టుప్రక్కల గ్రామాల భక్తుల మధ్య రథోత్సవం నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.



లక్కసాగరంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

- పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధికి రూ.7.09 కోట్లు మంజూరు
- ఇప్పటికే రూ.3.59 కోట్లతో 7 రోడ్లు పూర్తి
- 30 కిలోమీటర్లుకు పైగా బీటీ రోడ్డు నిర్మాణం

పత్తికొండటౌన్: పల్లె రహదారుల నిర్మాణం, అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోంది. గత కొన్నేళ్లుగా పల్లెల రోడ్లు అభివృద్ధి చేయకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు కొత్త కళ సంతరించుకుంటున్నాయి. గుంతలమయంగా అధ్వానస్థితిలో ఉన్న గ్రామీణ రోడ్ల అభివృద్ధి, మరమ్మతుల కోసం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సిఫారసుల మేరకు ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు రూ.7.09 కోట్లు మంజూరుచేసింది. పాట్‌హోల్ ఫ్రీ బీటీ లింక్ రోడ్స్ ప్రతిపాదనల కింద ప్రభుత్వం పత్తికొండ నియోజకవర్గంలోని 5 మండలాల్లోని 20 రోడ్లకు రూ.7.09 కోట్లు మంజూరుచేసింది.



నాడు - అధ్వానంగా ఉన్న పులికొండ రోడ్డు



నేడు - బీటీ రోడ్డుతో రూపుదిద్దుకుంది ఇలా..





నాడు- కంకరతేలిన స్థితిలో జొన్నగిరి-ప్యాపిలి రోడ్డు, నేడు- బీటీ రోడ్డుతో సౌకర్యంగా మారిన దృశ్యం

### సౌకర్యంగా మారిన రోడ్లు

మొత్తం మంజూరైన రోడ్లలో ఇప్పటికే రూ.3.59 కోట్లతో 8 గ్రామాలకు సంబంధించి 30 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం, అభివృద్ధి, మరమ్మతులు పూర్తయ్యాయి. ప్రధానంగా తుగ్గలి మండలం జొన్నగిరి–ప్యాపిలి రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉండేది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ఆయా గ్రామాల ప్రజలతో పాటు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఈ రూట్‌లో ఉప్పర్లపల్లె, బాటతండా, బోడబండ, బోడబండ తండాలతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన నల్లబెల్లి సుంకులమ్మ దేవస్థానం ఉంది. ఈ రోడ్డు మరమ్మతులు పూర్తి చేసి బీటీ రోడ్డు వేయడంతో ఇప్పుడు సౌకర్యంగా ఉంది. అలాగే పత్తికొండ మండలంలో పులికొండ, రాజులమందగిరి గ్రామాలలో ప్రముఖ దేవాలయాలు రంగనాథ స్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. గుంతలమయం అయి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఈ గ్రామాల రోడ్లు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. కోతిరాళ్ల, నలకదొడ్డి, చిన్నహుల్తి–పెద్దహుల్తి రోడ్లు పూర్తయి రాకపోకలకు సౌకర్యంగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన రోడ్లు నిర్మాణం కూడా పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

### 8 రోడ్లు పూర్తయ్యాయి



నియోజకవర్గంలోని 20 గ్రామీణ రోడ్ల అభివృద్ధి, మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే 8 రోడ్లు పూర్తయ్యాయి. మరికొన్ని రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. మిగతావి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. త్వరలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శేషయ్య, పంచాయతీరాజ్ డీఈఈ

**మండలాల వారీగా మంజూరైన రోడ్లు**

| రోడ్డు మంజూరైన గ్రామం | నిధులు (రూ.లక్షల్లో) |
|---|---|
| పత్తికొండ: పులికొండ | 15 |
| కోతిరాళ్ల | 27.12 |
| ఆర్.మందగిరి–జె.అగ్రహారం రోడ్డు | 62.37 |
| నలకదొడ్డి రోడ్డు | 66.62 |
| రామచంద్రాపురం కొట్టాల రోడ్డు | 10 |
| చిన్నహుల్తి–హోసూరు | 3.50 |
| తుగ్గలి: జొన్నగిరి–ప్యాపిలి వయా ఉప్పర్లపల్లె | 174.90 |
| జొన్నగిరి–ఆర్‌ఎస్.పెండేకల్లు–పగిడిరాయి | 226.19 |
| ఉప్పర్లపల్లె– బొల్లవానిపల్లె | 4.50 |
| ఉప్పర్లపల్లె–చెరువుతండా | 7 |
| బొందిమడుగుల–బొంతిరాళ్ల | 10 |
| వెల్దుర్తి: ఉయ్యాలవాడ–బుక్కాపురం | 6 |
| బింగిదొడ్డి–లక్ష్మినగరం | 5.5 |
| చెర్లోకొత్తూరు | 5 |
| డోన్–గోవర్ధనగిరి | 12.75 |
| మద్దికెర: జొన్నగిరి–మద్దికెర వయా రాంపురం | 30 |
| పెరవలి–బసినేపల్లి | 12 |
| హంప– కొత్తపల్లి | 10 |
| క్రిష్ణగిరి: వెల్దుర్తి–కోటకొండ వయా తొగర్చేడు | 13 |
| వెల్దుర్తి–కోడుమూరు వయా టి.గోకులపాడు | 8.50 |
| మొత్తం | రూ.709.95 లక్షలు |